క్లుప్తంగా

ఆళ్లమడుగులో బస్ షెల్టర్ నిర్మాణం



భూమిపూజ చేస్తున్న పద్మనాభరెడ్డి

వెదురుకుప్పం: మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు దళితవాడలో సొంత నిధులతో బస్‌షెల్టర్ నిర్మాణం చేపడుతున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. బుధవారం బస్ షెల్టర్ నిర్మాణానికి సంబంధించి ప్రధాన రహదారి పక్కన భూమిపూజ చేశారు. ప్రజల సౌకర్యార్థం రూ.4 లక్షలతో షెల్టర్ నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. రెండు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘ మండల అధ్యక్షురాలు భారతి, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా శివుడికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం : ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం ఆయన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏపీడీ సుబ్రమణ్యంతో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పనులు జరిగే ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. మేట్ల సహాయంతో తప్పకుండా రెండు ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి. అప్పుడే కూలీలకు బిల్లు సక్రమంగా వస్తుందని తెలిపారు. పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, జేఈ అనుష, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలంలోని గర్భిణులు రక్తపరీక్షలు చేసుకున్న తరువాతనే నెలసరి వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులను ఉచిత వైద్య పరీక్షలు కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులతో డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఓఆర్ఎస్, మజ్జిగ తీసుకోవాలన్నారు. గర్భిణీలు రక్త పరీక్షలు చేసుకున్న తరువాతనే నెలసరి వైద్య పరీక్షలు చేసుకుని మందులు వాడాలని సూచించారు. మాతాశిశు మరణాలు అరికట్టాలంటే ప్రసవాలు ప్రభుత్వం ఆస్పత్రిలోనే చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు వ్యాధినిరోధక శక్తి టీకాలు వేయాలన్నారు. అనంతరం గర్భిణులను రక్త పరీక్షలు చేసి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ సిబ్బంది

శ్రీరంగరాజపురం : ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సిందే అని మండల తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని, అందులో ప్రధానంగా అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం గుర్తించి ఇంటి పట్టాను అందించాలని అన్నారని, అసైన్‌మెంట్ భూములను గుర్తించి సంబంధిత లబ్ధిదారుల వివరాలను సేకరించి భూపంపిణీ ద్వారా పట్టా ఇవ్వడానికి జాబితాను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా శ్మశానం లేని గ్రామాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన శ్మశానానికి స్థలం కేటాయించిన స్థలాన్ని సంబంధిత గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలను తీసుకెళ్లి అందరి సమక్షంలో శ్మశాన భూమిని గ్రామానికి అప్పగించాలన్నారు. కార్యక్రమానికి మండల సర్వేయర్ మురళి, ఆర్ఐ త్యాగరాజులు, సచివాలయ వీఆర్ఓ, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరి డిగ్రీ కళాశాలకు ఏ ప్లస్



నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- మంత్రి రోజా సహకారంతో నాలుగేళ్లలో అనూహ్యరీతిలో పేరు ప్రఖ్యాతలు
- డిగ్రీ కళాశాలలోనే పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్య
- జిల్లాలో ఏ ప్లస్ పొందిన మొదటి డిగ్రీ కళాశాలగా రికార్డు

నగరి : గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడానికి 1978లో నిర్మించిన పభుత్వ డిగ్రీ కళాశాల కొన్ని కోర్సులతో కొనసాగుతూ రాగా గత నాలుగేళ్లలో అనూహ్యరీతిలో ముందడుగుకు వేస్తోంది. బీఎస్సీ, బీజెడ్సీ, బీకాం, బీఏ అంటూ నాలుగు కోర్సులతో ప్రారంభమైన ఈ కళాశాల నేడు బీఎస్సీ (ఎంపీసీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీకాం, బీకాం (సీఏ), బీబీఏ, బీఏ(హెచ్‌ఈపీ), ఈపీసీఏ కోర్సులతో పాటు పీజీలో ఎంకాం కోర్సులను నేడు నిర్వహించడంతో పాటు ఏడాది క్రితం నుంచి పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులను కూడా విద్యార్థులు నగరిలోనే బోధించేస్థాయికి అభివృద్ధి చెందింది. వీటితో పాటు ఈ ఏడాది నైపుణ్యాభివృద్ధి కోర్సులుగా టూరిజం అండ్ గైడెన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులు కూడా బోధిస్తున్నారు. కళాశాల అభివృద్ధికి కళాశాల బృందం మంత్రి దృష్టికి తెచ్చే ప్రతి అంశంపైనా మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఈ అభివృద్ధి సాధ్యపడింది. 152 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల నేడు 699 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తోంది.

జిల్లాలో ఏ ప్లస్ పొందిన మొదటి డిగ్రీ కళాశాల

2007లో మొదటి సైకిల్ ఆడిట్ జరగ్గా కళాశాలకు బీ గ్రేడ్ వచ్చింది. 2014లో రెండవ సైకిల్ ఆడిట్ జరగ్గా, అందులోనూ బీ గ్రేడ్ వచ్చింది. ప్రస్తుతం మంత్రి సహకారంతో కళాశాల పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడంతో గ్రేడింగ్ నిర్ధారించే నాక్ బృందం కరిక్యులంలో 3.6 క్యుమిలేటివ్ గ్రేడ్ పాయింట్లు, బోధనా అధ్యయనం, మూల్యాంకన విభాగంలో 3.15, పరిశోధన రంగం 3.14, భౌతిక సౌకర్యాలు, గ్రంథాలయంలో 3.51, విద్యార్థుల ఉన్నత విద్య ప్రవేశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ, ఉద్యోగాల కల్పనలో 3.67, పరిపాలన- నాయకత్వం, యాజమాన్యం పనితీరులో 2.92, నవకల్పనలు-ఉత్తమ పద్ధతులు విభాగంలో 3.36 గ్రేడ్ పాయింట్లు రాగా సరాసరిగా 3.28 గ్రేడ్ పాయింట్లు సాధించి జిల్లాలో తొలి కళాశాలగా ఏ ప్లస్ గ్రేడింగ్ పొందింది. రాష్ట్రస్థాయిలో ఏ ప్లస్ పొందిన రెండవ కళాశాలగా గుర్తింపు పొందింది.

ప్రభుత్వ సహకారం మెండు..



ఆడిట్‌లో నాక్ బృందం కళాశాలలోని ఉత్తమ పద్ధతులను నిశితంగా పరిశీలించి అకడమిక్ ఆడిట్, సర్టిఫికెట్-కోర్సులు, రెమిడియల్ కోచింగ్, నక్షత్రవనం వంటి అంశాలను తమ సంస్థలలో కూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. గత రెండు ఆడిట్ సైకిళ్లలో రాని ఏ ప్లస్ గ్రేడ్ ప్రస్తుతం కళాశాలకు అందింది. కళాశాలలోని వసతులు, సౌకర్యాలు, విద్యార్థులకు తగిన విధంగా తరగతి గదులు, అధునాతన ల్యాబ్‌లు, జిమ్, మైదానం ఇలా ఎన్నో అంశాలు గ్రేడ్ పొందడానికి సహకరించింది. సౌకర్యాలకు సహకరించిన మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- వేణుగోపాల్, ప్రిన్సిపల్, నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాల

సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం : సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు అని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ అవినీతిని నిగ్గు తేల్చాలని రాష్ట్రప్రభుత్వం సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తునకు ఆదేశిస్తే వాటి మీద టీడీపీ హైకోర్టులో స్టే తీసుకొచ్చిందన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి వేయడంతో ఆ స్టేను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రజాధనాన్ని తన స్వార్థం కోసం దుర్వినియోగం చేసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమానికి నాయకులు జనార్దన్, దిలీప్ రెడ్డి, భూపతి రెడ్డి, హరిప్రసాద్, బాలకృష్ణయాదవ్, దామునాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు వంటగది నిర్మాణం



శిరుగురాజుపాలెం స్కూల్‌లో నిర్మాణంలో ఉన్న వంటగది

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం స్కూల్‌లో నాడు-నేడు పథకం కింద వంటగది నిర్మిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం హంస తెలిపారు. బుధవారం మోల్డింగ్ పనులను సర్పంచ్ మురళీయాదవ్, ఇంజినీర్ అసిస్టెంట్ అనుదీప్‌తో కలిసి పర్యవేక్షించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరు ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రిలో వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పౌష్టికాహారం పంపిణీ కార్యాక్రమాన్ని నిరంతరాయంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావు, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి శంకర్‌నరేన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణ స్వామి, పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై సంఘమిత్రలకు శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం కవిత

వెదురుకుప్పం: స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారాన్ని లోకోస్ యాప్ ద్వారా నమోదు చేయాలని ఏపీఎం కవిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్ నిర్వహణపై సంఘమిత్రలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శక సేవల కోసం ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆయా సంఘమిత్ర సభ్యుల పరిధిలోని స్వయం సహాయక సంఘాల వివరాలను నమోదు చేయాలన్నారు. డిజిటలైజేషన్ జరుగుతున్న తరుణంలో లోకోస్ యాప్ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీసీలు కళావతి, దేవపుత్ర పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు స్కూళ్లపై కఠిన చర్యలు

వెదురుకుప్పం: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ప్రైవేటు స్కూళ్లను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శంకరయ్య అన్నారు. బుధవారం వెదురుకుప్పంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో భారతీయ విద్యామందిర్ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ స్కూల్‌లో పిల్లలను చేర్పించవద్దన్నారు. పిల్లలను చేర్పిస్తే సర్టిఫికెట్లు రావన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచి సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

వడమాలపేట ప్రజల రుణం తీర్చుకోలేనిది

- రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన మిమ్మల్ని మరువను
- ఎల్లో మీడియా అపద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టండి
- చంద్రబాబువి బూటకపు మాటలు
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందాం
- కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి ఆర్‌కే రోజా



పార్టీ పదవులు పొందిన వారితో మంత్రి రోజా, నాయకులు

వడమాలపేట : 'నేను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానంటే అందులో వడమాలపేట ప్రజలు, కార్యకర్తల కృషి ఎనలేనిది.. వారికి ఎంతచేసినా తక్కువే.. వారికి ఎప్పుడూ నేను రుణపడి ఉంటా' అని పర్యాటక శాఖ, సాంస్కృతిక, యువజనులు, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం సీఎంఆర్ గార్డెన్స్‌లో మండల పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మొదటగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి ముఖద్వారం వడమాలపేట అయితే నా విజయంలో ఈ మండల నాయకులు, ప్రజలు, కార్యకర్తలు కూడా ముఖద్వారంగా నిలిచారన్నారు. వీరికి ఎంతసేవ చేసినా రుణం తీర్చుకోలేనని తెలిపారు. జగనన్న నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి జరిగిందా ? లేదా ? అని తెలియాలంటే గతంలో ఎన్ని సంక్షేమ పథకాలు అందించారు ? ఇప్పుడు ఎన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నామనేది బేరీజు వేసుకుంటే చాలన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా ఒక కోటి 10 లక్షల మిస్డ్ కాల్స్ ఇచ్చారంటే జగనన్నపై ప్రజలకు ఎంత అభిమానం ఉందో ఇది చాలన్నారు. చంద్రబాబు నాయుడు రూ.10 ఇస్తే వెయ్యి రూపాయలు పబ్లిసిటీ చేసుకునేవారని తెలిపారు. జగనన్నతో చంద్రబాబును పోలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు.

నమ్మి గెలిపిస్తే.. నిండా ముంచారు..

రాష్ట్రం విడిపోయిన తరువాత 2014 ఎన్నికల్లో అనుభవం ఉందని చంద్రబాబునాయుడును ఎన్నుకున్నారని, అయితే గెలిపించిన ప్రజలకే ఆయన పంగనామాలు పెట్టారని తెలిపారు. జగనన్న కోసం ప్రాణం ఇచ్చే నన్ను ఓడించాలని చంద్రబాబునాయుడు వాళ్ల పార్టీ సమావేశాల్లో చెప్పారని, కానీ మీరు అవన్నీ పటాపంచలు చేసి గెలిపించారని తెలిపారు. ముఖ్యమంత్రి అని చూడకుండా చిన్నాచితకా నాయకులతో విమర్శిస్తే పచ్చ మీడియా దాన్ని పెద్దగా ప్రచారం చేస్తుందని, అలాంటి వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రినని చెప్పుకునే చంద్రబాబు ప్రజలకు మేము ఇవి చేశామని చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాడని తెలిపారు.

అవగాహన లేక గాలి విమర్శలు..

నగరి నియోజకవర్గంలో అవగాహన లేని ప్రతిపక్ష పార్టీ నాయకుడు భానుప్రకాష్ ఏదో పిచ్చి విమర్శలు చేస్తున్నారని మంత్రి రోజా అన్నారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందని అంటున్నాడని, గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి అడగాలని గాలి భానుకు సూచిస్తున్నానని తెలిపారు. ప్రజలే ఎంతమేలు జరిగిందో చెబుతారని తెలిపారు. కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెన్నుపోటు నాయకులను నమ్ముకుని గెలిచిపోతాం అనుకుంటున్నాడని, అది భ్రమే అన్నారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే వస్తే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు రానున్న ఈ పది నెలల పాటు కలిసికట్టుగా పని చేస్తే అందరికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్న ముఖ్యమంత్రిని చేసుకోవడంతో పాటు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు చేసే అవకాశం ఉంటుందన్నారు.

వడమాలపేట కన్వీనర్‌గా సుబ్రమణ్యంరెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వడమాలపేట మండల కన్వీనర్‌గా సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా బీసీ కార్యదర్శిగా మాజీ మండల కన్వీనర్ సదాశివయ్య, జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉమాపతి, సచివాలయాల కన్వీనర్లకు కన్వీనర్ సురేష్‌రాజు, సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా మంజులను ప్రకటించారు. అనంతరం మండల పార్టీ కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, కన్వీనర్ సదాశివయ్య, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, జెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ వైస్ చైర్మన్ శేఖర్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, జేసీఎ కన్వీనర్ సురేష్‌రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సదాశివకోన బోర్డు మెంబర్లు ఉదయ్, కమల, సర్పంచులు మునెమ్మ, మంజుల, కుసుమ, శ్రీవిద్య, శేషాద్రిరెడ్డి, ధర్మయ్య, ఎంపీటీసీలు, కార్యకర్తలు నాయకలు పాల్గొన్నారు.

నవరత్నాలే నవశకానికి నాంది

- మంత్రి ఆర్‌కే రోజా



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : నవరత్నాలే నవశకానికి నాంది పలుకుతుందని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం పేదల పాలిట వరంగా మారిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం ఆమె మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్ ఏ, బీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను అందించారు. పథకాలు అందడంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ప్రతి పేద ఇంటి తలుపు తట్టి వారికి వరాలు కురిపించాయన్నారు. పేదల సంక్షేమమే అజెండాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతోందన్నారు. ఈ సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలపరచాలన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బిలాల్, భూపాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, నాయకులు జైలాబ్దీన్, ముబారక్, ఎస్సీ ఆనందకుమార్, మురుగ, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వివిధ శాఖ అధికారులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగజాతరకు ఆహ్వానం

విజయపురం (నగరి) : విజయపురంలో నిర్వహించనున్న గంగజాతరకు స్థానిక పార్టీ నాయకులు, గ్రామపెద్దలు మంత్రి రోజాను, ఆమె సోదరులు కుమారస్వామి రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం ఇద్దరినీ కలసిన నాయకులు దుశ్శాలువలతో వారిని సత్కరించి జాతరకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివరాజు, రామచంద్రరాజు, సుబ్రమణ్యం రాజు, రామకృష్ణమరాజు, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర



భక్తులకు దర్శనమిస్తున్న నడివీధి గంగమ్మ అమ్మవారు

కార్వేటినగరం: మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలో మంగళవారం నుంచి జరుగుతున్న నడవీధి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రీతికరమైన అంబలి సమర్పణతో ప్రారంభమైన జాతర ప్రారంభ మైన నడివీధి గంగమ్మ జాతర బుధవారం అమ్మవారిని జల్దితో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని మంగళవారం రాత్రి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుదరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం అమ్మవారిని నడివీధిల్లో కొలువుదీర్చి కుంభం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పలువురు ప్రముఖులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని, గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామపెద్దలు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పలువురు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు



తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి



వెదురుకుప్పంలో..

కార్వేటినగరం: అమ్మపల్లి వద్ద జరుగుతున్న శ్రీద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల వారి 29వ మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఎంతో ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవీ ఉత్సవ మూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం 12 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపించారు. తపస్సుమానును అధిరోహిస్తూ విబూధి, నిమ్మ పండ్లను భక్తులపై విసిరారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం తడి దుస్తులతో తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి సుమతి భక్తులకు పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమానికి అమ్మపల్లి గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత మహోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన అర్జున తపస్మాన్ కార్యక్రమం ఆకట్టుకుంది. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున తపస్సుమానును అర్జునుడి వేషధారి శివ భక్తిపాటలను ఆలపిస్తూ భక్తులను కనువిందు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అర్జునుడి పూజాఫలాల కోసం ఎగబడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి రత్నకుమారిచే హరికథా కాలక్షేపం జరిగింది.

విధి నిర్వహణలో సమయపాలన పాటించండి



ఆర్కేవీబీ పేటలో డ్యాష్ బోర్డు వివరాలను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: రైతు భరోసా కేంద్రంలో పని చేసే సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఏఓ ఆర్.హేమలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం రాయితీ అందించే విత్తనాలు, ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా రైతు భరోసాకేంద్రం సిబ్బంది రైతులకు సీజన్ల వారీగా సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఎక్కువగా చిరుధాన్యాలు, వాణిజ్య పంటలను సాగు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం కియోస్క్ మిషన్ వాడకంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ గాయత్రి, పంచాయతీ కార్యదర్శి లోకేష్, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

నగరి : విశాఖ ఉక్కు పరిశ్రమను అంతా కలిసికట్టుగా పోరాడాఇ పరిరక్షించుకుందాం అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం ఓంశక్తి ఆలయ సమీపం బైపాస్ సర్కిల్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలని ఆనాడు ×విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సుదీర్ఘ పోరాటం చేసి సుమారు 32 మంది ప్రాణత్యాగాలు చేసి, 56 మంది సీపీఐ, సీపీఎం శాసనసభ్యులు రాజీనామాలు చేసిన ఫలితంగా విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. ఆ ఉక్కు ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా సుమారు 35 వేల మంది కార్మికులకు, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని విక్రయించడానికి కంకణం కట్టుకుందని, దాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రైవేటుపరం చేయకూడదని చేస్తున్న పోరాటానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, మురళి, దాము రెడ్డి, ఏఐటీయూసీ పట్టణ నాయకులు సత్తార్ రూప్ కుమార్, నాగరాజు, మోహన్, రాజేంద్ర పాల్గొన్నారు.